## క్లుప్తంగా

### నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో 50మంది నిరుపేదలకు గ్రామానికి చెందిన ఎ.లక్ష్మణ్ తన సొంత డబ్బులతో దుప్పట్లు పంపిణీ చేశారు. తన తల్లి జ్ఞాపకార్థం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్టు దాత లక్ష్మణ్ తెలిపారు. నిరుపేదలకు సేవాకార్యక్రమాలను చేసేందుకు సహకరిస్తున్న యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవనాయుడు, ఎ.సాయినంద, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### అవసరమైన పనుల ప్రణాళిక సిద్ధం చేయండి



అజ్జాడలో పనుల గుర్తింపుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బలిజిపేట: 2024-25ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధిపనుల గుర్తింపునకు గ్రామాల్లో పనుల ప్రణాళిక ఎంతో అవసరమని ఏపీఓ కేశవరావు అన్నారు. ఈ మేరకు అజ్జాడ గ్రామంలో పనుల ప్రణాళికపై చిత్రపటం ద్వారా శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన సూచనలు ఇస్తూ పంచాయతీ పరిధిలో రానున్న సంవత్సరానికి రూ.2.18కోట్ల విలువైన పనులు చేసేందుకు అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా పనుల గుర్తింపు జరగాలని కోరారు. ముఖ్యంగా పండ్ల తోటల పెంపకానికి సంబంధించి ఎక్కువగా పనులు గుర్తించడం మంచిదని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.రవికుమార్, సిబ్బంది, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

### జీసీసీ పెట్రోల్ బంక్ పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న జీసీసీ డీఎం మహేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం: పెట్రోల్ బంక్‌కు వచ్చే వాహనదారులకు సత్వరమే సేవలందించాలని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. సిబ్బంది పనితీరు, వ్యాపార లావాదేవీలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట జీసీసీ బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, పెట్రోల్ బంక్ ఇన్‌ఛార్జ్ భాస్కరరావు ఉన్నారు.

### జీసీసీ ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ తనిఖీ



బియ్యం నిల్వలు, నాణ్యతను పరిశీలిస్తున్న సివిల్‌సప్లై డీఎస్ఓ శివప్రసాద్

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం జీసీసీ ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్(గొడాం)ను సివిల్‌సప్లై డీఎస్ఓ శివప్రసాద్, జీసీసీ డీఎం వి.మహేంద్రకుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గొడాంలో నిల్వ ఉన్న బియ్యం, కందిపప్పు నిల్వలు, వాటి నాణ్యతను పరిశీలించారు. వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, డిపోలకు సకాలంలో సరఫరా చేస్తున్నారా లేదా అని ఆరాతీశారు. వారి వెంట బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, గొడాం ఇన్‌ఛార్జ్ ఎం.సాంబశివరావు తదితరులు ఉన్నారు.

### 70 లీటర్ల సారా పట్టివేత

వీరఘట్టం: మండలంలోని కొంచ గ్రామ సమీపంలో సారా విక్రయిస్తున్న మండంగి ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎంవీ రమణ శుక్రవారం తెలిపారు. అతని వద్ద 70 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు.

**కొప్పెరడాం కొండ సమీపంలో..**

సీతంపేట: అక్రమంగా సారా తరలిస్తున్న సవర బాపడు అనే వ్యక్తిని కొప్పెరడాం కొండ సమీపంలో శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. అతని వద్ద 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

## జగనన్న ఆరోగ్యసురక్షకు
# విశేష స్పందన

- ఎస్టీ కమిషన్ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



బలిజిపేట: అజ్జాడలో జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు



సాలూరు: గిరిజనులకు వైద్యపరీక్షలు చేస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

సాలూరు: ప్రజలకు వైద్యసేవలు ఉచితంగా చేరువ చేసే ప్రధాన ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమానికి మైదాన ప్రాంతాలతో పాటు గిరిజన ప్రాంతాల్లోను విశేష స్పందన లభిస్తోందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కొటియా గ్రూప్ గ్రామాలైన సాలూరు మండలంలోని గిరిశిఖర సారిక, ధూళిభద్రలలో పర్యటించారు. అక్కడ జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు. స్వయానా ఆయన వైద్యుడు కావడంతో స్టెతస్కోప్ పెట్టుకుని పలువురు గిరిజనులకు వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ వైద్యశిబిరాల్లో ప్రజల వ్యాధులు గుర్తించడంతోపాటు వాటికి ఉచితంగా చికిత్స చేయించనున్నట్లు చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్ష అని స్పష్టం చేశారు. స్పెషలిస్ట్ వైద్యులతో ప్రజలకు ఉచితంగా ప్రత్యేక పరీక్షలు చేయిస్తున్న ఈ శిబిరాలకు ,ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని సంతోషం వెలిబుచ్చారు.

**నాడు-నేడుతో మారిన పాఠశాలలు**

సారిక పాఠశాలను ఆయన సందర్శించిన ఆయన అక్కడ విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. నాడునేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి మార్చారన్నారు. ఆరోగ్యం, విద్యపై శ్రద్ధ వహించాలని ప్రజలకు సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించిన ఆయన , సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొని గర్భిణులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ శ్రీనువాసరావు, డిప్యూటీడీఎంహెచ్ఓ శ్రీనివాసరావు, ఎంపీడీఓ పార్వతి, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, పార్టీ నాయకులు సువ్వాడ భరత్, శ్రీనివాసరావు, దండి శ్రీనివాసరావు, రాజారావు, బీసు తదితరులు పాల్గొన్నారు.

**అజ్జాడలో 486మందికి వైద్యసేవలు**

బలిజిపేట: మండలంలోని అజ్జాడలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 486మందికి వైద్యసేవలు అందించినట్లు అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారి శిశిధర్ తెలిపారు. అజ్జాడలో నిర్వహించిన శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ ఎ.రవికుమార్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నిరుపేదలకు ఉచితంగా అన్ని రకాల సదుపాయాలు, సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ముఖ్యంగా వైద్యసేవలు భారీస్థాయిలో అందించడం గొప్ప విషయమని, ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు జి.శశిధర్, సందీప్‌రెడ్డి, స్వరూప్, శ్యామలాదేవి, తహసీల్దార్ అప్పలరాజు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

**పేదలకు అందుబాటులో ఉచితవైద్య సేవలు**

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా పేదలందరికీ ఉచిత వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండలనాయకుడు బి.శ్రీరాములునాయుడు అన్నారు. ఈ మేరకు సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ కె.శిరీష, సర్పంచ్ పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్.వెంకంపేటలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్య శిబిరాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సుగుణ, ఎస్ఓ పూర్ణిమ, పీఏసీఎస్ ఛైర్మన్, పంచాయతీ కార్యదర్శులు మురళి, రజని, ఆశవర్కర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు వై. గోపాలనాయుడు పాల్గొన్నారు.

**609 మందికి వైద్య సేవలు**

ఆర్ వెంకంపేటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్య శిబిరంలో 614 మందికి వైద్య సేవలుఅందించినట్లు సీతానగరం పీహెచ్‌సీ సీహెచ్ఓ ఎస్వీ రమణ తెలిపారు.



సీతానగరం: పౌష్టికాహారం స్టాల్స్‌ను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ బాబ్జీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరాములునాయుడు

## జిల్లాలో 7,70,525 మంది ఓటర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

- కలెక్టర్ నిషాంత్ కుమార్
- ఓటర్ల జాబితా ముసాయిదా ప్రతి విడుదల

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో 7,70,525 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురణ ప్రతిని శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో విడుదల చేశారు. జిల్లాలో 7,70,525 మంది ఓటర్లు ఉండగా అందులో నియోజకవర్గాల వారీగా ఇలా వివరాలు కలెక్టర్ విడుదల చేసి ముసాయిదా జాబితా ప్రకారం ఇలా ఉన్నాయి.

కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి టీవీ రమణ, సీపీఐ ప్రతినిధి రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి కె.వెంకటనాయుడు, లోక్‌సత్తాపార్టీ ప్రతినిధి కె. పాపారావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి. రవికుమార్, కలెక్టర్ కార్యాలయం పర్యవేక్షకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ట్రాన్స్‌జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| పాలకొండ- ఎస్టీ | 95500 | 100495 | 12 | 196007 |
| కురుపాం-ఎస్టీ | 92084 | 97288 | 39 | 189411 |
| పార్వతీపురం-ఎస్సీ | 91987 | 94858 | 11 | 186856 |
| సాలూరు-ఎస్టీ | 96649 | 101599 | 3 | 198251 |
| మొత్తం | 3,76,220 | 394240 | 65 | 770525 |

## వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అధికారులతో కలిసి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే వినతులు పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం ఎంపీడీఓ కార్యాలయం సమావేశం మందిరంలో కలెక్టర్ జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్, రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం .లావణ్యతో కలిసి ప్రజలు అందించిన వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 85 వినతులు అందాయి. వాటిలో ముఖ్యంగా గుమ్మలక్ష్మీపురం ఎంపీడీఓ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుందని, నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక వినతిపత్రం అందజేశారు. మంగళాపురం గ్రామ సమీపంలోని రుంగండ గెడ్డ వద్ద సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన చెక్‌డ్యాం పాడవ్వడం వలన వ్యవసాయ భూములకు సాగునీరు సక్రమంగా అందడం లేదని, మరమ్మతు పనులు చేయించాలని మండంగి నాగేశ్వరరావు తదితర రైతులు వినతిపత్రం అందజేశారు. సంధిగూడ గ్రామానికి అంగన్వాడీ భవనం, పాఠశాలను మంజూరు చేయాలని గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. కేదారిపురం కాలనీలో గల అంగన్వాడీ భవనం శిథిలావస్థకు చేరిందని, మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో పూర్వీకుల నుంచి జీవనం సాగిస్తున్నామని, తమకు ఇళ్ల స్థలాలు, పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కేదారిపురం, పి.లేవిడి గ్రామాలకు చెందిన పసుపురెడ్డి మహేష్, ఎం.శోభన్‌బాబు తదితరులు వినతిపత్రం అందజేశారు. వినతులు స్వీకరించిన కలెక్టర్ ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు, సూచనలు చేశారు.

కార్యక్రమంలో డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ కె.రామచంద్రారావు, స్కూల్ ఎడ్యుకేషన్ సహాయ సంచాలకులు ఎంఈ రాణి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎం.ఎస్.రాణి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి జి.మల్లికార్జున, జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా ఉద్యానవన అధికారి కె.వి.ఎన్.రెడ్డి, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ జె.రత్నాకర్, బీసీ సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ, ముఖ్య ప్రణాళికా అధికారి వీర్రాజు, తహసీల్దార్ జె.రాములమ్మ, ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని బీఎస్ఆర్ కళింగ వైశ్య కళ్యాణ మండపం వద్ద శనివారం వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కుంబురుకు దీనమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు,గృహ సారథులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

### పోలీసుల సేవలపై అవగాహన : ఎస్పీ



విద్యార్థులకు ఆయుధాల పనితీరును వివరిస్తున్న పోలీసు సిబ్బంది

పార్వతీపురం టౌన్: పోలీసు శాఖ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించేందుకే ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తెలిపారు. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్, పోలీసు అధికారులు ఓపెన్ హౌస్‌ను సందర్శించి, విద్యార్థులతో మమేకమయ్యారు. పోలీసు శాఖ నిర్వహించే వివిధ ఆయుధాలు, అత్యాధునిక పరికరాలు పట్ల అవగాహన కల్పించి, వారిలో స్ఫూర్తి నింపారు. జిల్లా పోలీసు శాఖలో కమ్యునికేషన్ వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. దిశా యాప్ మనతో ఉంటే - రక్షణ మన వెంటే అని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్, ఎస్‌బీ సీఐ సీహెచ్ లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంతో డీసీఆర్‌బీ సీఐ, ఎస్ఐ పర్యవేక్షణలో శుక్రవారం పోలీసు ఉద్యోగులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. పోలీస్ ఉద్యోగులకు 'లైంగిక వేధింపుల నుంచి మహిళలు, పిల్లల రక్షణ - సామాజిక పాత్ర (ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ ఫ్రమ్ అబ్యూజ్ సోసియల్ రోల్) అంశంపై వ్యాసరచన, 'సోషల్ మీడియా దుర్వినియోగం సైబర్ మోసాన్ని ఎదుర్కోవడంలో సాంకేతికత ప్రభావం'పై వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

### గృహ నిర్మాణాలపై సమీక్ష

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జగనన్న కాలనీ గృహ నిర్మాణాలపై హౌసింగ్ డీఎం వి.శ్రీనివాసరావు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలన్నారు.

## చెత్తనుంచి సంపద తయారీతో ఆర్థిక తోడ్పాటు



ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కుమారవర్మ

సీతానగరం: గ్రామాల్లో గ్రీన్‌అబాసిడర్లు సేకరించిన తడి-పొడి చెత్తతో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల్లో సంపద తయారు చేయడం వల్ల పంచాయతీలు ఆర్థికాభివృద్ధికి నోచుకుంటాయని ఈఓపీఆర్డీ కె. కుమారవర్మ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం జగ్గునాయుడుపేటలో చెత్తనుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నియమించిన గ్రీన్‌అంబాసిడర్లు సేకరిస్తున్న తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా ఎస్‌డబ్ల్యూపీసీల్లో శుద్ధి చేసి ఎరువు తయారు చేయడం వల్ల పంచాయతీలకు అదనంగా ఆర్థిక తోడ్పాటు లభిస్తుందన్నారు. అన్నిగ్రామ పంచాయతీల్లో చెత్తశుద్ధి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి వచ్చేలా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని సూచించారు. అలాగే గ్రామంలో అమలవుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.రజని, ఇంజినీరింగ్ సహాయకుడు పాల్గొన్నారు.

## బీజామృతం తయారీ



బర్లిలో తయారుచేస్తున్న బీజామృతాన్ని పరిశీలస్తున్న ఏడీఏ శారద

బలిజిపేట: రబీ సీజన్‌లో వేసే అపరాల పంట విత్తనాలైన పెసలు, మినుముల శుద్ధికి బీజామృతం ఎంతో ఉపయోగపడుతుందని వ్యవసాయశాఖ ఏడీఏ శారద అన్నారు. ఈ మేరకు మండలంలోని బర్లి గ్రామంలో బీజామృతం తయారీపై రైతులకు ప్రకృతి వ్యవసాయ శాఖకు సంబంధించిన ఎంసీఆర్పీ లక్ష్మి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ శారద మాట్లాడుతూ రబీలో జల్లాల్సిన మినుములు, పెసల విత్తనాల శుద్ధిచేసుకునేందుకు బీజామృతం వినియోగించాలని సూచించారు. దీని తయారీకి 30లీటర్ల నీటిలో 10లీటర్ల గోమూత్రం కలిపి 10కిలోల ఆవుపేడను మూటకట్టి ఒక రాత్రంతా నీరు, మూత్రం మిశ్రమంలో వీలాడదీసి మరుసటి రోజు పేడమూటను బయటకు తీసి 100గ్రాముల సున్నాన్ని కొద్దిగా పుట్టమట్టిని కలిపి దీనిలో విత్తనాలను శుద్ధిచేసుకునేందుకు ఉపయోగించుకోవాలని వివరించారు. ఈ విధంగా చేయడం వల్ల విత్తన శుద్ధి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శ్రావణ్, వీఏఏ చాందిని, సీఆర్పీ తిరుపతిరావు, స్వాతి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పొరపాట్లు తెలియజేయాలి



సీతానగరం: తామరఖండి ఆర్బీకేలో ఈపంటనమోదు జాబితాను పరిశీలిస్తున్న ఏఓ ఎస్. అవినాష్



అరసాడలో జాబితాను చదివి వినిపిస్తున్న వీఏఏ ఐశ్వర్య

బలిజిపేట: 2023ఖరీఫ్ సీజనులో ఈ-క్రాప్‌లో నమోదైన రైతుల జాబితా వివరాలను సామాజిక తనిఖీ నిమిత్తం ఆర్బీకేలలో చదివి వినిపించి, ప్రదర్శిస్తున్నామని ఏఓ శ్రావణ్ తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం బర్లి, అరసాడలలో ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సవరణ నిమిత్తం రాతపూర్వకంగా తెలియచేయాలని రైతులను కోరారు. తదుపరి జాబితాను నవంబరు 1న, తరువాత తుది జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. ఆ తరువాత ఎటువంటి మార్పులకు అవకాశం ఉండదన్నారు. ప్రతి రైతుభరోసా కేంద్రంలో చదివి వినిపిస్తున్న, ప్రదర్శిస్తున్న జాబితాను వెంటనే పరిశీలించుకోవాలని కోరారు. ఎవరికి ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తెలియచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**తామరఖండి ఆర్బీకేలో ఈ పంట జాబితా**

సీతానగరం: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో వేలాడ దీసిన ఈ పంటనమోదు వివరాలను చూసి ఎవరికైనా అభ్యంతరాలుంటే లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఏఓ ఎస్.అవినాష్ రైతులను కోరారు. ఈ మేరకు శుక్రవారం వ్యవసాయ సహాయకుడు ఆర్బీకేలో వేలాడదీసిన ఈ పంట నమోదు వివరాలను పరిశీలించి రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ, రేపటివలస, తామరఖండి గ్రామాల రైతులు, వ్యవసాయ సహాయకులు, శ్రమశక్తి సంఘాల సభ్యులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

## పూర్తిస్థాయిలో వైద్యసేవలు

- నేడు 9 జిల్లాలో 9 జేఏఎస్ వైద్య శిభిరాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలు సమస్యలతో వచ్చిన వారందరికీ మందులు పూర్తిస్థాయిలో అందజేస్తున్నామన్నారు. రిఫరల్ అవసరమైన వారిని గుర్తించి జిల్లా ఆస్పత్రికి పంపుతున్నామన్నారు. ప్రజలందరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**నేటి వైద్య శిబిరాల నిర్వహణ ఇలా..**

| పీహెచ్‌సీ | శిబిరం నిర్వహించే ప్రాంతం |
|---|---|
| అరసాడ | మిర్తివలస, ఎంపీఈఎస్ |
| తాడికొండ | గుమ్మలక్ష్మీపురం, జీయూపీస్కూల్ |
| మాదలింగి | బయ్యాలవలస, గ్రామ సచివాలయం |
| పెంబొండపల్లి | ఎమ్మార్‌నగరం, జెడ్పీహెచ్ఎస్ |
| తోణాం | కొదమ, గ్రామ సచివాలయం |
| మక్కువ | పూతికవలస, ఎంపీపీ పాఠశాల |
| రావివలస | చింతల బెలగాం, గ్రామ సచివాలయం |
| సాలూరు అర్బన్ | డబ్బివీధి, మున్సిపల్ హైస్కూల్ |
| సీతానగరం | పెదభోగిలి, ఎంపీపీ స్కూల్ |

## ఆధార్ అనుసంధానం తప్పనిసరి

రేగిడి: ఉపాధిహామీ పనులు చేస్తున్న వేతనదారులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని ఏపీఓ ఎస్.హరనాథరావు సూచించారు. మండలంలోని అంబఖండి, సోమరాజుపేట, ఉంగరాడ తదితర గ్రామాల్లో వేతనదారులకు ఆధార్ అనుసంధానంపై శుక్రవారం అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం ఉంటేనే డబ్బులు ఖాతాల్లో పడతాయని, లేకుంటే డబ్బులు రావాని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

### సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

బొబ్బిలి: మండలంలోని కొండదేవుపల్లి గ్రామంలో అవసరమైన చోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నేత శంబంగి వేణుగోపాలనాయుడు శుక్రవారం భూమిపూజ చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, అన్ని ప్రాంతాల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని ఆయన అన్నారు.